# ధర్మాంజలి

రచయిత, ప్రకాశకులు :

**డా॥ గుర్లింక ధర్మరాజు**

M.A., Telugu Pandit, B.Ed., Ph.D.

ఆంధ్రోపన్యాసకులు, తెలుగుశాఖాధ్యక్షులు

**మహారాణీ కళాశాల, పెద్దాపురం** - 533 437,

తూ॥గో॥జిల్లా. **సెల్ : 98487 24374**

'సర్వహక్కులు రచయితవే'

ప్రథమ ముద్రణ : 2017

ప్రతులు : 500

**వెల : రూ. 40/-**

చిరునామా :

**డా॥ గుర్లింక ధర్మరాజు,** ఆంధ్రోపన్యాసకులు

C/o శ్రీ నిమ్మకాయల నారాయణరావుగారు

డోర్ నెం. 17-1-16, నాగిశెట్టివారి వీధి,

**సామర్లకోట - 533 440**

సెల్ : 98487 24374

# ముందుమాట

**"ధర్మాంజలి"**ని రచించుశక్తి నాకొసగిన ఆ పరమేశ్వరునికి ముందుగా నమస్కార కృతజ్ఞతలు తెల్పుకొనుచున్నాను. నాకు ధర్మశతకము, ధర్మ రాజీయము, ధర్మప్రబోధము, ధర్మాభిషేకమునకిచ్చిన చేయూతనే ఈ గ్రంథమునకు ఇచ్చి నన్ను ప్రోత్సహించిన గురుదేవులు శ్రీ మధునాపంతుల వేంకటపరమయ్యగార్కి, కవిరత్న శ్రీ కందుకూరి శ్రీరామచంద్రమూర్తి, ఎం.ఎ., గారికి, కవిసభాపతి శ్రీ సలాది ప్రభంజనస్వామి గార్కి నా కృతజ్ఞతాంజలి సమర్పించుకొనుచున్నాను.

నాకు జన్మనిచ్చిన కీ॥ శే॥ శ్రీ గుర్లింక గౌతయ్యగారు, మాజీ ప్రెసిడెంట్ నంగవరం, శ్రీమతి సత్యవెంకట తులసీ దమయంతి అనే ధనమ్మగార్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

పెద్దాపురం మహారాణి కళాశాల పాలకవర్గ ఫౌండర్ ప్రెసిడెంట్‌గార్కి, పాలకవర్గ అధ్యక్షులకు, కరస్పాండెంట్‌గార్కి, మెంబర్లకు, ప్రిన్సిపాల్‌గార్కి, వైస్ ప్రిన్సిపాల్‌గార్కి, సూపరింటెండెంట్‌వార్కి, తెలుగుశాఖ అప్పటి అధిపతులు మరియు రీడర్ డా॥ ఎ. సుబ్బారావుగార్కి, తెలుగు రీడర్స్, డా॥ బి.ఎస్. జ్ఞానేశ్వరిగార్కి, డా॥ జె. కృష్ణబాబుగార్కి, విశ్రాంత అధ్యాపకులు బి.ఎస్. భాస్కరకుమార్‌గార్కి, తెలుగు లెక్చరర్స్ శ్రీ టి.వి.వి. సత్యనారాయణగార్కి, శ్రీ ఎస్. సూర్యనారాయణగార్కి, శ్రీ జి. మోహన్‌దుర్గారావుగార్కి, కళాశాల అధ్యాపక అధ్యాపకేతరులందరికీ పేరుపేరునా నా ప్రేమపూర్వక కృతజ్ఞతాంజలి ఘటి స్తున్నాను. రిటైర్డ్ ప్రిన్సిపాల్స్‌కి, వైస్ ప్రిన్సిపాల్స్‌కి సూపరింటెండెంట్స్ గార్కి, లెక్చరర్స్‌కి నా నమస్కారములు, కృతజ్ఞతలు.



నా అక్కలకు, బావగార్లకు, అన్నయ్యలకు వదినగార్లకు నా నమస్కార ములు, కృతజ్ఞతలు. వారి సంతానమెల్లరకూ, నా భార్యాబిడ్డలకు నా దీవెనలు. నా శ్రేయోభిలాషులకు, నా భుజంపై చేయి వేసి ధర్మరాజా! అని నన్ను పిలిచే వార్కి, నాకేదైనా సమస్య వస్తే వెంటనే చెప్పుకొంటే వినే గొప్ప వ్యక్తులకు నా వినయపూర్వక కృతజ్ఞతలు.

సాహితీ విషయాలలో నాకెన్నో సలహాలనిచ్చిన కుమారి చర్ల ఏణాక్షిగార్కి, శ్రీ చర్ల వేంకట సీతారామారావుగార్లకు నా కృతజ్ఞతలు.

ప్రపంచశాంతికి దోహదపడే ప్రతీ ఒక్కరికీ నా కృతజ్ఞతలు.

**"అంజలించుచుంటి అమ్మకు నాన్నకు**
**అంజలించుచుంటి ఆప్తులకును**
**అంజలించుచుంటి అయిన వాళ్ళకునేను**
**అంజలించుచుంటి అందుకొనుడు."**

చిరునామా :

**డా॥ గుర్లింక ధర్మరాజు,** ఆంధ్రోపన్యాసకులు, శాఖాధిపతి

మహారాణీ కళాశాల, పెద్దాపురం

సెల్ : 98487 24374

## శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్యగారు

1. మాటనెమ్మదాయె మనసెంత నెమ్మదో
మంచిమాట నొసగు మాన్యుడితడు
పరుల మేలుకోరు పండితుడౌరౌర
ధర్మరాజు తెలుపు ధర్మమిదియె।

2. పద్యవిద్యనేర్పి హృద్యమౌ కవితలు
వ్రాయగల్గుశక్తి వచ్చునట్లు
చేయగల్గినారు సాయమెంతయొచేసి
వందనములు స్వామి అందుకొనుడు

3. ఖ్యాతినందిన పరమయ్యగారి చరిత
మార్గదర్శకమౌనండి మౌని కనుక
కోపతాపాలు తెలియక కూర్మిజూపి
రాచబాటను చూపించు రామకృష్ణ

4. ఆచితూచుచు మాట్లాడు నతడు కనుక
అందరాప్యాయ మొలికింతురతని యెడల
దుఃఖమెప్పుడు తొలగించు దొడ్డ గురువు
గురువు పరమయ్య మాటలు గొప్పవయ్య।

5. చిన్న కష్టమ్ము చెప్పుట చేతకాదు
పరుల బాధను తొలగించు బ్రహ్మమితడు
నామ జపమొక్కటే వీరి క్షేమ మరయు
మనకు సుఖమును కలిగించు మంచియోగి

6. శక్తికొలది జపము ముక్తికై చేయంగ
ముక్తినందగలరు మునులు కనుక
యుక్తవయసునుండి ముక్తికై యత్నించి
భక్త జనుల కొఱకు పాటుపడిరి



## స్నేహజీవితము

1. చిన్ననాటినుండి స్నేహమ్ము చేయుచున్
కలసి చదివినాము చెలిమిచేసి
చిన్నవాడవైన చెప్పెడి జ్ఞానమ్ము
అందిపుచ్చుకొనెడి అన్న నీకు

**శ్రీ అయోధ్యల పద్మ రాజేంద్రకుమార్,**
ఉత్తమోపాధ్యాయులు, సామర్లకోట మున్సిపల్ హైస్కూల్

2. స్నేహశీలిమీరు జీవితమున నాకు
వినయశీలురయ్య విజ్ఞులయ్య
ధర్మశీలురయ్య ధర్మమ్ము చేయుచున్
మనసులోన నిలచె మంచి మనిషి

**శ్రీ తలసిల దామోదర్‌గారు**
ప్రిన్సిపాల్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ బాయ్స్, మచిలీపట్నం

3. ఎంతకష్టమైన కొంతలో కొంతైన
స్నేహితులకు జెప్ప చింతతొలగు
అట్టి స్నేహితునకు అంజలించుటమేలు
ధర్మరాజు తెలుపు ధర్మమిదియె

**శ్రీ జహీరుద్దీన్‌గారు**

4. మనసు తెలిసిన మామంచి మనిషి మీరు
ఉన్నదున్నట్లు మాట్లాడు ఒజ్జబంతి
స్నేహసౌధమ్ము కట్టిరి జీవితమున
మరువలేనట్టి మాటలు మరపురావు!

**కీ॥శే॥ డా. జి. సూర్యనారాయణమూర్తిగారు**

5. ఎచట పుట్టినానొ ఇచట కలసి
స్నేహమందినాను నేను మీతొ
చిన్న విషయమైన చెప్పుకోకుండగా
ఉండలేను మీరె అండ దండ!

**శ్రీ జంగారెడ్డి కృష్ణబాబుగారు,** రిటైర్డ్ డి.ఎస్.పి.,

## శ్రీ ఎస్. ఆర్. పృధ్విగార్కి పృధ్వ్యష్టకము

1. గుండె గాయములకు గుట్టుగా మందిచ్చి
నాన్న దీర్ఘ కవిత నల్లినారు
వ్యాసదీపికిపుడు వ్యాపించెనంతటా
దశదిశల లోనదాని ఘనత

2. పృధ్విపైన మీరు ఏ కావ్యమల్లినన్
పాఠకునికి నదియె భాగ్యమయ్యె
హాయి గొలుపు కావ్యమంతటా విలసిల్లె
ఇంతకంటె భాగ్యమేమి కలదు

3. మంచి గురువు మిమ్ము మర్యాదగా చూచు
అద్దెపల్లి లాంటి అందగాడు
మీకు ముందు నడచి మేలైన దారిని
చూపగలిగె మీకు చూపగలిగె

4. అందమైన కవిత లల్లుట మీ వంతు
అందులోని సారమంత ఘనము
మీదు కవిత చదివి మేల్బంతి కోవలో
పెట్టు పెద్దలంత గట్టివారె!

5. వృత్తిగాని వృత్తి వృత్తిగాచేపట్టి
కవితలల్లుటెంత ఘనము స్వామి
పృధ్విగారి కవిత ఎన్నడూ మేల్బంతె
ధర్మరాజు మాట తప్ప దెపుడు

6. పుడమితల్లి మిమ్ము భువిపైకి గొని తెచ్చి
చక్కనైన కవిగ సాకెనయ్య
ఆర్ద్రమైన కవిత అందమై వెలుగొంద
పృధ్వికవిత పెద్ద పేరుగాంచె



7. నిత్యనూతనత్వ నేర్పరి మా పృధ్వి
కవిత వ్రాయు రీతి కమ్మనౌగ
చిక్కనైన కవిత చిద్విలాసమ్ముతో
హృదయమందిరముల కెక్కునయ్య

8. పృధ్విపైన మీరు వేయేండ్లు జీవించ
గలరు కనుక మీరు కావ్యమల్లు
పూజచేసినట్టి పూజ్యులు మీరయా
అందుకొనుడు స్వామి అంజలింతు।

## గుర్లింక రవిరామ్‌కి స్మృత్యంజలి

1. మమ్ము గెల్చినావు మా కంటె ముందుగా
స్వర్గమేగినావు సాహసమున
ఎంత కుమిలినావొ ఈ రీతి మరణించ
తిరిగిరాని చోటు దొరకె నీకు

2. తల్లికెంత దన్నొ తండ్రికీ దన్నొగ
వెన్నుదన్నుపోయి కన్నవారు
అన్నతోడు కొఱకు నల్లాడి పోయెను
నంగవరము ప్రజలు కృంగిరపుడు

3. నీదు మాట నీదె నీ పంతమే నెగ్గి
గుడులు గోపురములు వడిగ తిరిగె
అందమైన మోము కందెను రవిరాము
ఎంత బాధ మాకు శాంతి లేదు.

4. గుర్తువచ్చినపుడు గుబులాయె మనసంత
నిప్పులాంటి రవికి ముప్పువచ్చె
పెళ్ళి వయసు వచ్చె చల్లనయ్యవు నీకు
కళ్ళ ముందులేని గతులు కలిగె!

5. అంజలించు చుంటినయ్యయ్యో రవిబాబు
అంజలించు చుంటినందు కొనుము
మోక్షమంది నీవు మునులకే మునివయ్య
భయము లేని బాట పట్టినావు.

**మహారాణీ కళాశాల పెద్దాపురం**

## పంచరత్నములు

1. ఉన్నత భావముల్‌కలిగి ఉన్నతికోరుచు ముందు చూపుతో
ఎన్నికగన్నవారు తమరీ ప్రజ విద్యను వృద్ధిచేయగా
తిన్నగ జూచి ఈ జనుల తెల్విని పెంచగ కట్టినట్టి, పే
రెన్నిక గన్న పెద్దలకు ప్రేమగ వందనమాచరించెదన్

2. చంటిదొరలకు సాక్షిగా చదువుచెప్పి
చిన్న పిల్లల పెద్దల చేయుటకును
వారువేసిన బాటను పదిలపరచి
చదువుచెప్పంగ మాకెంత సంబరమ్ము

3. చుట్టుప్రక్కల వారలు చుట్టిముట్టి
వారి బిడ్డల చేర్పించి బాగుపడగ
వీలుపడినంతలో మేము విద్యనేర్పి
తీర్చి దిద్దుటమావంతు తెలిసికొనుడు

4. ఆటపాటలు మంచిగా ఆడిపాడి
యుక్తవయసును కాపాడి ముక్తిగనుట
చేతనైనట్టి విద్యలకూతమిచ్చి
తీర్చిదిద్దుట మావంతు తెలిసికొనుడు

5. తెలుగు దనమును కాపాడు తీయదనము
ఎల్లవేళల విన్పించతెల్లమగును
వివిధ విద్యల నేర్పించవేదికిదియె
రాణిపేరున వెలయంగ రాణకెక్కె.



## శ్రీశ్రీగారి దివ్యస్మృతికి పద్యాష్టకము

1. కదము త్రొక్కినాడు కవితలల్లుచునాడు
పదము పదముపైన పట్టుకలిగి
వేయిమందిలోన ఏయొక్కడోనుండు
తెలుగు సాహితీకి దీప్తి నొసగ।

2. శ్రమను దోచుకొనగ శత్రువై గర్జించు
గుణము కలిగినట్టి కొమరుడితడు
నరము నరములోన నావారు కూలీలె
అనుచు పలుకునట్టి ఆంధ్రుడితడు

3. ఊహ ఊహలోన ఊరేగు కూలీలె
ఇతని కవితలోన ఇంపుమీర
ధనికులనిన ఇతడు దరిదాపు చేరడు
కూలివాని చెలిమి గొప్పదనుచు

4. ధనికుడెపుడు పెరిగి ధనికుడై వెలుగొందు
పేదవానికెపుడు బీదతనమె
అదియు చూడలేక అల్లాడిపోయెను
శ్రీనివాసరావు బాణి ఇదియె

5. కలిమి లేములెపుడు కలకాలముండవు
కూలివాడు కూడ గొప్పవాడె
కాలచక్ర మహిమ కాదనువారేరి
శ్రామికుండు కూడ చక్రవర్తె

6. శ్రీనివాసరావు శ్రీశ్రీగ నిలిచాడు
ప్రజల హృదయమందు పదిలముగను
ఎంత మధురమయ్య ఈతని కవితలు
కండ కలిగినట్టి కవితలయ్య!

7. పద్యమనిన ప్రేమ పాతరోజులలోన
వచన కవితలల్లు వాటమెరిగి
మధురమైన కవిత మనసార రచియించె
ఖండకావ్యమల్లు కర్షకుండు

8. పదము పేర్చు రీతి ముదము గొల్పును సుమా
ఏర్చి కూర్చు పదము నింపుగాను
అగ్రతాంబులమ్ము నందు కోగలిగాడు
పేరు గొప్ప దితని తీరు గొప్ప!

## రవీంద్రుని అష్టకాంజలి

1. లోతు తెలియని మనిషికి లోతు తెలిపి
కవితలల్లంగశక్తిని కలిగెనితడు
కళలు తెలిసిన మనిషికి కవిత తెలిసి
హృదయముప్పొంగ వ్రాసిన ఇతడె ఘనుడు।

2. జనగణమన యనెడి జాతీయగీతమ్ము
భరతజాతి కొఅకు పదిలపరచె
ఇతని ఖ్యాతి పెంచెనిది యొక్కటేకాదు
రత్నములను పోలు రచనలెన్నొ।

3. కవిత విలువపెంచు కవితలెన్నింటినో
భవిత కొఅకు వ్రాసి భవితజూపు
వంగ కవితలెన్నొ ఇంగిలీషుకి మారె
విశ్వకవిని గనెను విశ్వమాత।

4. అక్షరాక్షరమున అందాలు చిందగా
కవితలల్లినట్టి కవివినీవు
నీదు కవితలెన్నొ నీ నుండి వెడలగా
దేశదేశములలొ తీర్థమాడె।



5. కవికి కథలు నేర్పు కవిగారి కథలకు
వందనములు స్వామి అందుకొనుడు
మిమ్ముగూర్చి వినిన మేమెంత ధన్యులం
వంగ దేశమునకు వందనములు

6. ఇంగిలీషువారి కింపైన కవితలు
వ్రాయగల్గినట్టి చేయి మీది
ఇంగిలీషెకాక ఇలలోన సాహితి
నిన్ను మరువదెపుడు నిజము నిజము।

7. అందువలనె మీర లందుకొన్నారయా
శాంతిబహుమతటుల శాంతమూర్తి
ఎప్పుడందుకొనిన దిలలోన సాహితి
నీకు నీవె సాటి నిజము తండ్రి

8. శాంతి కాముకునికి శాంతి చేకూరెను
వంగదేశమునకు బెంగలేక
నిన్ను మరువమయ్య నీవారమే మేము
శాంతమూర్తి నీకు శాంతి శాంతి।

## తిరుమలవాసా శ్రీశ్రీనివాసా!

1. భక్తిశ్రద్ధలతోడ భజియింతుమో స్వామి
కరుణించి మమ్ముల కావరావె।

శేషాద్రివాసుడా శ్రీశ్రీనివాసుడా
మాదుకష్టములన్ని మాన్పరాదె

నామాల దేవుడా ఏ మాయ చేశావొ
నీ కొండయే మాకు నెలవు తండ్రి

నోరువాయియు లేక ఉన్న భక్తుల కెప్డు
తోడునీడయు నీవె గోడు తీర్చ

అ. భ్రాంతితొలగ జేసి భద్రమ్ముగా చూడు
ఏడుకొండలెక్కి వేడుకొనగ
గుండెబండ బార దెండలో నడచినా
అలపు సొలపులేని పిలుపువలన

2. రోజురోజుకి నీ మీద మోజుపెరిగి
శక్తియున్నను లేకున్న ముక్తి కొఱకు
ఏడుకొండలనెక్కుచు వేడుకొనెడి
భక్తజనులను కాపాడు భవ్యచరిత।

3. అన్నమయ్యకు నచ్చిన అందగాడ
ఎన్ని కీర్తన లెన్నెన్నొ నిన్ను పొగడ
తనివి తీరగ రచియించె ధన్యజీవి
ధర్మమైనట్టి కీర్తన ల్ధాత్రినిలచె।

4. ఆంధ్రకవులకెంత ఆరాటమో స్వామి
నిన్ను పొగడలేని, నిముషమేది
నిండుకుండ యనగ నీవేలె ఓ స్వామి
నీకు మ్రొక్కినపుడె మాకు శాంతి।

5. నిన్ను తలచిన వెంటనే కన్నతండ్రి
మాదు కష్టాలు తొలగెడి మందులిచ్చి
గుండె భారమ్ము తొలగించు గురుడవీవె।
పాదపద్మాలు పూజించు భక్తుడితడు।

## బాలసాహిత్యము

1. అల్లరి చిన్నపిల్లలను అందరు మెచ్చుట వింతకాదు ఆ
యల్లరి చిన్నపిల్లలకు అబ్బిన విద్యకు వందనమ్ము ఏ
ఎల్లలు లేక హద్దులవి ఎంతగ దాటుచు ముందు కేగ ఆ
చల్లని బుల్లి పాపలను సంఘము మెచ్చుట తప్పదెప్పుడున్।



2. అక్షరమును నేర్చ ఆ చంటిబిడ్డడే
పదములెన్నొ పల్కు ముదమునొంద
తల్లికెంత ముద్దు తండ్రికీ ముద్దొగ
ఇరుగుపొరుగు వారికెంతముద్దు

3. చదువురానివారి హృదయమ్ము మోటయ్యు
మాటవినరు మంచిబాట కనరు
మూర్ఖపట్టుదలను మోటుగా వాదింతు
రతని మార్చునొకటె అదియె విద్య

4. చెప్పినపుడు వినడు చేతకా కందువా
విద్యలేదు కనుక వినడు వినడు
జ్ఞాన శూన్యుడతడు మానవుడేకాని
విద్య నేర్పినపుడు విజ్ఞుడగును

5. అక్షరమ్ము కన్న అధికమౌ సంపద
ఎక్కడైన కలదె? ఎప్పుడైన
అక్షరమును నేర్చి అధికారివౌగదే
అదియె ధనము నీకు పదిలమగును।

6. దారితెలియరాదు భారమౌ దూరమ్ము
విద్యలేనినాడు వెట్టివాడ
అక్షరములు నేర్వ అమెరికా కేగుట
సులభమయ్య నీకు సులభమగును

7. చదువులేనినాడు చెమటోడ్చి బ్రతుకుట
ఎంతకష్టమగునొ ఎవరికెఱుక
సుళువు బరువులన్ని చూపించు, చదువంగ
కనుక చదువుకొనుట మనకు మేలు।

8. చదువుకొన్నవాడు చదువుకొననివాడు
బ్రతుకగలరు ఏమి బాధలేదు
చదువుకున్నవాని సంస్కారమెప్పుడున్
చదువుకొనని వాని సాధ్యమగునె।

9. బ్రతుకుట చేతకాక భవబంధములెన్నియొపెంచుకొంచు నీ
కతుకులు బొంత జీవితమె హాయిని గొల్పునదేమి కర్మమో
బ్రతుకుట నేర్పజూపి భవబంధములన్నియు త్రెంపజూడ నీ
మతమును మార్చగాతరమె మానవజన్మకు మోక్షమెన్నడో

## బాలికా సాహిత్యము

1. చిన్ని పాప నీకు చెప్పెద నోమాట
భక్తి శ్రద్ధలుంచి బాగుపడుము
అన్నదమ్ములనిన ఆప్యాయముంచుము
కష్టకాలమందు కాయగలరు!

2. చిన్నతనములోన చెప్పెడి మాటలు
పెద్దవయసులోన పెన్నిధగును
పనికిరాని మాట వినకూడదోయమ్మ
పనికి వచ్చు మాట పాటియగును।

3. గురువుదైవమనుచు గురువును పూజించు
చదువు చెప్పి నిన్ను సాకగలడు
తల్లిదండ్రి కన్న దైవమే గురువమ్మ
కనుక శ్రద్ధ తోడ గనుము గురుని।

4. అమ్మనాన్న నీకు నాది గురువులమ్మ
వారికెపుడు నీవు చేరియుండు
నీకు మేలు చేయు నిన్ను తిట్టినగాని
కోపముంచుకొనకు కూర్మితల్లి



5. ఇంటగెలిచి నప్పుడీలోక మేనీకు
తలను వంచునెపుడు తప్పదమ్మ
మంచిగుణము నీకు మంచిదారిని చూపు
ధర్మరాజు మాట తప్పదమ్మ।

6. భారమగు జవ్వనపు మూగ కోరికలను
మోయ నీ గుండె బ్రద్దలై పోదుగాని
కాలు జారిన పిదపరా జాలదింక
అనెడి కావ్యశ్రి పలుకున కంజలింతు

7. యుక్తవయసులోన ఒక్కొక్క యదుగును
చూచివేయుటెంత సొంపు తల్లి
గొప్ప యజ్ఞమమ్ము గుట్టుగా బ్రతుకుట
ఇదియు తెలిసినప్పుడెంత సుఖము

8. తల్లిదండ్రి మాట తక్కువగానెంచి
పరుల మాట వినిన భంగపాటు
కొంపముంచు నమ్మ కూర్మిబంగరుతల్లి
ధర్మరాజు మాట తప్పదెపుడు।

9. తల్లిదండ్రి మాట జవదాటినప్పుడు
నష్టమెంతొ కలిగి కష్టమగును
కన్నతల్లి దండ్రి కడతన్క సాకుదు
రందు వలనె వారలమ్మ, నాన్న!

10. విజ్ఞులైన వారి విలువైన మాటలు
వినుట మంచిదమ్మ వేదమదియె।
మనకు క్షేమ మమ్మ మనవారికీ క్షేమ
మందువలనె వినుట అందమమ్మ।

## నన్ను తరచుగా బడి మార్చకు నాన్న

1. చెప్పకుండ మములనెప్పుడూ విడదీసి
స్కూలు మార్చుటేల జాలిలేద
మాదు స్నేహమంత మంటగలసిపోయె
దారుణమ్ము నిదియు దారుణమ్ము

2. ఎప్పుడేవూరు పోతామొ చెప్పలేము
పెంచుకున్నట్టి ప్రేమంత త్రెంచుటేల
ఫ్రెండులేనట్టి జీవితమెండిపోయె
నీరసించుట తథ్యమ్ము ఘోరమిదియు

3. ఫ్రెండుగుర్తు వచ్చి పెద్దగా ఏడ్చినా
కాన రాడువాడు కడకు నాకు
చెప్పకుండ నేను చేరితి నీవూరు
అర్ధరాత్రి కూడ నతని గుర్తె

4. నిన్న ఫ్రెండు నాకు నేతిమిఠాయిని
తెచ్చినాడు దానినిచ్చినాడు
ఇంతలోన నాన్న ఈ వూరు కొనితెచ్చె
కానరాడు నాకు కానరాడు

5. ఎంత కష్టమయ్యె ఏరీతి చెప్పను
అంత మంచి స్నేహమంతరించె
అతని చూడలేని ఆ రాత్రి నిదురేది
కంటిమీద కునుకు కానరాక

6. మొండి తండ్రి నన్ను మోటగా గొనిపోయి
పొరుగు వూరి కంప పూనుకొనెను
గొప్ప చదువులనుచు చెప్పజూచెను నాకు
ఫ్రెండుకాన రాని బండచదువు



7. ఎన్ని కథలొ నాకు ఎంతగా చెప్పినా
తనివి తీరదతని మనసు తెలుసు
తాయిలమ్ముతెచ్చి తాజాగ తినిపించు
మంచి ఫ్రెండునెటుల మరచిపోను

8. కలసి ఉండనీరు కడతన్క మమ్ముల
వేరు చేసినారు విజ్ఞులయ్యె
ఫ్రెండుకాన రాని బండచదువులేల
అండ దండలన్ని ఫ్రెండె నాకు!

## సముద్రము

1. అలల తాకిడి కెంతటి అందమోయి
పాలనురుగులు చిందించి పరవశింప
ఒకటి తరువాత నొకటిగా హొయలు చూప
చూచువారల కెంతటి సోయగమ్ము!

2. అల్పమైనట్టి కెరటమ్ము లణగి మణగి
దూకుడైనట్టి కెరటాలు దుమ్ములేప
స్నానమాడేటి జనులకు సంబరముగ
ఎగసిపడునట్టి కెరటాల కెంతమోజు

3. కడుపులో దాచె నాతల్లి ఒడుపుగాను
సుడుల నడుమున తిరుగాడుచున్నవెన్నొ
మంచిముత్యాలె కాదయ్య మానవునికి
నిత్యముపయోగ పడునట్టి ముత్యమలర!

4. విశ్వమంతయు తనయున్కి విస్తరింప
దేశదేశాల జనులకు దిక్కుచూపి
ఒక్కటౌనట్లు జేసెడి ఒజ్జబంతి
తనకు లేదయ్య గర్వమ్ము మనకువోలె!

5. తిండిలేనట్టి జనులకు తిండినొసగు
పంటపొలముకు మించిన పంటపొలము
సహజమైనట్టి సంపద సంద్రమొసగు
శాస్త్రపరిశోధనమ్ముకు మేస్త్రి కాదె!

6. మనసు బాధపడిన మామూలు మనుషులే
నిన్నుపోల్చుకొనుట నేటి మహిమ
అట్టిఘోష నీది ఆది నుండియు కూడ
కనుక పోల్చగలరు కవులు నిన్ను

7. దర్శకులకు నీవు దరిదాపునుందువు
సింబలిజము చూప చిత్రమగును
కరుణ రసము చూప కన్పించు నీరూపు
చెప్పకుండ చెప్పు చిత్రమిదియె!

8. కోరుకున్న జంట చేరువవ్వాలని
నీదుచెంత జేరి నిన్నుకోరు
మమ్ము కలుపుమమ్మ మా తల్లి సంద్రమా!
అనుచుకోరు జంట ఆత్మనిండ!

## పుష్కరాష్టకము

1. తూర్పు పశ్చిమములు తోరణములు కట్టి
స్వాగతించినాము స్వాగతమ్ము
మమ్ము బ్రోచునట్టి మాతల్లి గోదారి
స్వాగతమ్ము నీకు స్వాగతమ్ము

2. శ్రమకు లెక్కలేక శ్రామికశక్తితో
పుష్కరములు జరుప పూనుకొనగ
ధనిక బీదయనెడి తారతమ్యము లేదు
స్నానమాచరించు జనులచూడ!



3. రాజమండ్రినాడు రాజుల చేతిలో
పుష్కరముల హోరు పోటుకెత్తె
రాజమండ్రి నేడు రాణించె పుష్కర్ణి
భక్త జనుల తోడ భక్తి కలిగి

4. బ్రాహ్మణోత్తములను పదిమందినీ జూచి
పరవశించె తల్లి శిరసువంచి
ధైర్య సాహసములు తమకివ్వమని కోరు
శ్రద్ధ భక్తి కలిగి జనులచూడ

5. వేదికాయెనాడు వేదమంత్రములకు
పుష్కరములు వచ్చి పొంగిపొరలి
భక్తులెందరేని ముక్తినందగలరు
హారతిచ్చినట్టి తీరుజూడ!

6. అందచందములకు ఆ రాజమండ్రియే
నిండు చందమామ నిజము నిజము
పుష్కరములు వచ్చి పులకించిపోగల
దేటిగట్టు జనుల వాట మెటిగి

7. కవుల కన్నతల్లి కాదనువారేరి
ఆదికవిని గన్నయమ్మ నీవు
నీకు మ్రొక్కినపుడు నిలచును సంపద
అందుకొనుము తల్లి హారతిదిగొ!

8. సకలజనులు కలిసి సరదాగ స్నానమ్ము
చేయుచున్న తీరు హాయిగొలుపు
ముచ్చటైన భక్తి మురిపమ్ము గొల్పదే
క్షామ మంతరించి క్షేమమొసగు

# నిద్ర

1. కష్టకాలమందు కనురెప్ప పడదాయె
నిద్రలేక మనసు ఛిద్రమాయె
నిద్రలేనినాడు నీరసించుటతప్ప
ఏమిచేయగలడు ఇంక మనిషి

2. నిద్రముద్రపడిన నీటుగా కన్పించు
అదియులేని మోము కందమేది
రసములెన్నియున్న రసరాజు నిద్రయే
నిద్రపోయినపుడు నీకు సుఖము

3. శ్రమను పడ్డ మనిషి శ్రామికుడేయైన
నిద్ర పట్టినపుడు భద్రమగును
ఎంత కష్టపడిన అంతగా నిద్రించు
చీకు చింత లేక జీవితమున

4. నిద్ర విలువ తెలిసి నీవెంతొ జాగ్రత్త
పడుట మేలు నీకు పదిలమదియె
మంచిబాట నడచి మర్యాద పాటించు
చక్కగానె నిద్ర సాకు నిన్ను

5. అప్పులేని జీవికెప్పుడూ సుఖమేగ
తిప్పలెందుకయ్య అప్పువలదు
ముప్పులేనినాడు ముద్దుగా నిద్రించు
నిద్రపోయినపుడు భద్రమగును

6. రెప్పపాటులోనె తప్పుజరుగునండి
నిద్రలేమి వలన భద్రమేది
నిద్ర వచ్చినపుడు నిద్రపో మిత్రమా
ప్రాణప్రదము నిద్ర ప్రాణికెపుడు



7. నిద్రకెంత బలము నిజముగా చూడండి
కన్నురెప్పపాటు కలిగినపుడు
బస్సు లోయలోన పడినప్డు చూడండి
నిద్ర కెంత బలము నీకె తెలియు

8. రాత్రివేళలందు రహదారి యాత్రలు
మానవలయు మనము మానవలయు
నిద్ర ముంచుకొచ్చి నీటైన బ్రతుకులు
తెల్లవారకుండ తెల్లవారు!

## కీ॥శే॥ కామ్రేడ్ యాసలపు సూర్యారావుగార్కి పంచరత్నములు

1. కష్టజీవి మీరు కాదనువారేరి
కష్టమిష్టమైన కవులు మీరు
కష్టజీవి గోడు గమనించినారయా।
సృష్టిలోని కవుల దృష్టి కలిగి

2. మాటమీద నిలచు మా మంచివారలు
కౌన్సిలరుగ నెగ్గి గణనకెక్కి
మిమ్ము నమ్ముకొనిన మీ వారలందరూ
ఫలితమందుకొనిరి పదిలపడిరి

3. పుస్తకములు వ్రాసి పొందికగానుండి
వినయమొకటె తెలిసి విజ్ఞులైరి
మస్తకమును చూడ మర్యాద కన్పించు
మాకు దూరమైన మంచి మనిషి

4. ధనము ధనము ధనము ధనముపై ప్రేమతో
మంచి చెడును మరచు మనుషులుండ
న్యాయమార్గమంది సాయమ్ము చేయుచూ
ప్రజల మేలు కోరు భాగ్యశాలి!

5. కవులు మెచ్చగలరు కవితలు వ్రాయగ
జనులు మెచ్చగలరు శాశ్వతముగ
కవులు, జనులు మెచ్చు కలకాలమూ మిమ్ము
ధర్మ రాజు తెలుపు ధర్మమిదియె!

## మహాసాధ్వి మదర్ థెరీసా

1. తల్లిగ జన్మమెత్తితివి ధన్యము జన్మము నీదు జీవితం
చిల్లరి ఊహలెందుకని చిన్నతనమ్మునె పెద్ద ఊహలే
పల్లకి ఎక్కకుండగనె పద్ధతి మేరకు రూపుదిద్దగా
ఎల్లలు లేని కీర్తిగని ఎందరభాగ్యుల తల్లివైతివో!

2. ఓర్పు గలిగినట్టి ఓయమ్మ నీ సేవ
దశదిశలలోన ధరణి నిలిచె
శాంతమూర్తి నీది ఎంత గొప్పమనసు
మదరు థెరిస పేరు మరువరెవరు

3. చిరునామ తెలియక చిక్కిపోయిన వార్కి
మరునాడె నీ యండ మురిపమాయె
కోపతాపము లేక కొండంత అండతో
పట్టెడన్నము పెట్టు పడతివీవు
భరతదేశమ్ములో కొఱత లేకుండగా
బీదవార్కి నీవు పెన్నిధౌగ
జాజ్వల్యమానమై జగతికే దీపమై
వెల్గుపంచిన నీకు వేయి నతులు

శ్వేతవర్ణమైన నేత బట్టను కట్టి
భరతజాతి విలువ పదిల పఱచి
ఏవగింపులేక జీవుల కాపాడు
పుణ్యమూర్తి నిన్ను పోలరెవరు



4. ఏన్గువంటి మనిషి పీన్గులా మారినా
పీన్గు వంటివాడు ఏన్గుయైన
చిన్న కారణమ్మె జీవితమ్మున చూడ
ఊతమిచ్చు మాట ఒకటి చాలు!

5. చిరునవ్వు తొలగని చిద్విలాసమ్ముతో
మల్లెపూవును బోలు మనసు కలిగి
జీవితాంతము మీరు చిరకాల వాంఛగా
పేదవారియెడల ప్రేమ కలిగి
అనుకోని రీతిలో ధనకాంక్ష లేకనే
బెంగాలు చేరిన పెన్నిధౌర
బెంగాలు సీమయే బంగారమని నమ్మి
కొంగుపఱచి వారి కూర్మి జూచు

లోకమాతవు నీవు లోకమ్మె నీదమ్మ
దిక్కులేని వార్కి దిక్కు నీవు
జాలి కరుణ కలిగి జాలి చూపెడి నీవు
తల్లివమ్మ నీది మల్లెమనసు

6. కులము మతము లేదు గోత్రమ్ము లేదయా
బాధ తొలగజేయు బాట తప్ప
స్వార్ధరహితమైన జన్మమ్మె జన్మమ్ము
అదియె నీది తల్లి అవనినిపుడు

7. భరతదేశమంత సరదాగ తిరుగాడి
బీదవారి మనసు సేదదీర్చి
ధైర్యసాహసములు తమవంతు నేర్పుచూ
అండ నిలచునట్టి గుండె నీది

8. నిండు మనిషి మీరు నిండైన మాటలు
పంచి పెట్టి ప్రజల బాగుకోరె
అమ్మ నీదు మాట అవనికే వెలుగౌను
మదరు థెరిస మిమ్ము మరువరెవరు!

## సమైక్యాంధ్రాష్టకము

1. మనసు మూగవోయె మాట పలుకదాయె
ఉద్యమానికున్న ఊపు జూచి
పెద్దచిన్నలంత బిగియించె పిడికిలి
ఆంధ్ర క్షేమ మరసి ఆంధ్రులంత!

2. రెండు నెలలు దాటి రేయంత పగలంత
కంటి మీద కునుకు కానరాక
బెంగ తోడ జనులు భీతిల్లుచుండగా
కేంద్ర జనుల మాట క్రింద పడదె!

3. ఇంటి మాట మరచి ఇలవేల్పుగాదీక్ష
చేయుచున్నవారి క్షేమ మరసి
కేంద్రమంత్రులేల క్రిందికి దిగిరారు
ఆంధ్ర జనుల ఘోష కర్థమేది?

4. బ్రతుకు మాట మరచి పదిమంది ఒక్కటై
దీక్షపూనినారు మోక్షమరసి
స్వంత పనులు మరచి ఇంతవరకు వీరు
దీక్ష పూనినారు మోక్షమేది?

5. ధనిక బీదలంత దరిచేరి ఒక్కటై
మొక్కవోని ప్రేమ మక్కువౌగ
కలసిమెలసినారు కలకాలముండంగ
దాని చీల్చుటేల ధర్మమేన?



6. బ్రతుకు బాట మరచి బ్రతుకంత రోడ్లపై
ఒలకబోసె ప్రజలు కలసిమెలసి
ఒక్కమాటమీద ఓర్పుగా జీవించు
టాంధ్ర గొప్ప తనము కర్థమిదియె।

7. ధనము విలువ తగ్గి ధర్మమ్ము తగ్గినా
అమ్మనెవరు మరువ రాంధ్రులయ్య
అట్టి యమ్మనిటుల అయ్యయో విడదీయు
టెంత దుఃఖమయ్య ఎంత బాధ!

8. చేతులెత్తి మ్రొక్క సిగ్గుకాదయ్యరో
మమ్ము కలిసి ఉంచుమమ్మ ఒడిని
వేరు చేయుటెపుడు దారుణ కృత్యమే
చీల్చుటెపుడు మాకు చేటె తండ్రి

## స్వామి వివేకానందాష్టకము

1. చచ్చు పుచ్చు జనులు చవటలై పెరుగుచు
దారి తప్పినారు తీరులేక
వీరినుద్ధరించు వేదాంతి లేకనే
స్వామి పుట్టినాడు చక్క బఱచ।

2. గౌరవాదరములు కన్పించవేమూల
తల్లి మాట వినని పిల్లలాయె
తండ్రి మాటకెపుడు దక్కదు గౌరవం
ఇట్టివార్ని మార్చ ఇతను పుట్టె

3. పిల్ల పెద్దలంత ప్రేమింతు రీతని
శత్రు వసలు లేని మిత్రుడౌర
భరతజాతి ఖ్యాతి పదిరెట్లు హెచ్చించి
అమెరికాకు తెల్పినతడె ఇతడు

4. ఇతని దేశసేవ ఇనుమడింపగ నేడు
మేలుకొనుట మనకు మేలు కాదె
మనిషి మీద మనిషి మమతానురాగముల్
పెంచుకొన్ననాడు మంచి జరుగు

5. రామకృష్ణులెపుడొ రక్షించె మనలను
స్వార్థచింత నాపు వాట మెఱిగి
జ్ఞాన మర్థమైన ధ్యానమే ధ్యానమ్ము
ఇదియు సత్యమనుచు నెఱుక పఱచె

6. జ్ఞానులంత స్వామి జ్ఞానమ్ము గైకొని
నేటి తరము వారి నిగ్గు తేల్చ
నడుము కట్టినపుడు కుడి ఎడమే లేదు
కలసి మెలసి బ్రతుకు తలపు కలుగు

7. చిన్నకష్టమైన ఎన్నడూ పడలేని
స్వామి మనసు చూడు కోమలమ్ము
అందమైన రూపమా స్వామి కిచ్చిన
దేవదేవుడేల తిరిగి గొనియె!

8. దేశదేశములకు దీటైన జ్ఞానమ్ము
కలుగుటనగ మనకు గర్వమదియె
అట్టి జ్ఞానమితడె అందరికీపంచి
భరతమాత పరువు పదిల పఱచె!

## భారతదేశ స్వాతంత్ర్యాష్టకము

1. గాంధి నెహ్రూ నాడు కాంగ్రెస్సు వాదులై
జెండ నెగురవేసె నిండుగాను
ఇద్దరొక్కరైరి ఇరువైపు లా కాసి
దేశ శృంఖలములు త్రెంపినారు



2. వర్తకమును నడుప వచ్చినవారలు
భర్తలైరి మనకు పరువు చెఱచి
గీత పుట్టినట్టి గీర్వాణ దేశమ్ము
రాత మారి నలిగె చేతకాక!

3. దేశ సంపదంత లేశమ్ము మిగలక
వట్టిపోయె నొట్టి కట్టె వోలె
ఇట్టి కష్టకాలమిక తాళలేకనే
భరతమాత కనెను భవ్యులిలను

4. గాంధి నెహ్రూ నాడు కరచాలనమ్ముతో
దేశమంత తిరిగి దీక్షపూని
తెల్లవారలంత ఎల్లలు దాటంగ
పద్మవ్యూహమల్లి పారద్రోలె

5. ఎత్తు మీద ఎత్తు చిత్తు చేయగ బూనె
తెల్లవార్ని పంప నల్లవారు
మొక్కవోని ధైర్యమెక్కువై పోరాడి
గుండె చూపినట్టి మొండివారు

6. నాల్గు మూలలందు నమ్మకమేర్పడి
గాంధి నెహ్రూ నాడు కదము త్రొక్కి
చిక్కబట్టినారు చేతితో గుండెలు
అడుగు వేసినారు పిడుగువోలె

7. వీరి వెనుక వచ్చి వేర్వేరు దారుల
తెల్లవార్ని తరుమ నల్లవారు
గుండె చూపి వారి గుండెలో గునపమై
ఎదురు నిల్చినపుడు బెదురులేక

8. పిల్లపెద్దలంత ఎల్లవారొక్కటై
పోరుసల్పినారు ఘోరముగనె
తెల్లవారు తలలు దించుకొన్నారుగా
భరతమాత తలను పైకి ఎత్తె!

## నిదానమే ప్రధానము

1. మనసు స్థిమిత పఱచి మంచిగా నడిపించు
నీదు వాహనమును నేర్పు జూపి
సైడు స్టాండు వేసి చక్కగా మఱచావు
అదియె కొంపముంచు నప్పుడపుడు

2. బండి మీద బండి పరుగెత్తుటేలనో
ఎడము పెంచి నీవు నడపలేవె?
ఒక్క నిముష మాగి చక్కగా నడిపించు
అదియె భద్రమయ్య అందరికిని

3. సమయపాలనమ్ము జాగ్రత్త పాటించి
బండి నడిపినపుడు భద్రమగును
ఏక్సిడెంట్సు లేల ఏడుపులేలయా
కనుక స్పీడు తగ్గి గమ్యమేగు

4. నీకు చెప్పు శక్తి నాకున్నదో లేదొ
చెప్పకుండ మనసు కొప్పదయ్య
తెలిసి చెప్పుచుంటి తెలిసికో మిత్రమా
ధర్మమార్గమెపుడు ధన్యమౌర!

5. ముందు బండి దాటి ముందుకేగగ నీవు
ఎడమ ప్రక్క కెన్నడేగవలదు
కొద్ది స్పీడు పెంచి కుడి ప్రక్క కేగుము
అందమైన డ్రైవరతనె సుమ్మ!



6. ఆయురారోగ్యవంతుడై అతను వెడల
దారుణమ్ముగ ఢీకొన్న కారణముగ
పెద్ద పయనమ్మె చేసెనా పెద్దమనిషి
ముష్కరమ్ముగ గ్రుద్దంగ మోటమనిషి

7. మరల రాదయ్య ఈ జన్మ మరచిపోకు
ఎముక విరిగిన చిట్లిన ఎంతబాధ
చంటి పిల్లల గ్రుద్దుట కంట కంబె
కొంత నెమ్మది పాటించు గ్రుద్దకుండ

8. ధనముపైనున్న ఆశకు దారిమార్చి
మనసు నొప్పించకుండగా మాటలాడి
మానవత్వమ్ము తోనీవు మాట కలిపి
ముందుకేగంగ నీ దారి ముద్దు గొలుపు!

## భారత మాజీ రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలాంగార్కి అష్టకాంజలి

1. ఒక్క మనుజుడితడు చుక్కల్లో చంద్రుడు
మనసు వెన్న ఇతని మాట వెన్న
కోపమెఱుగడితడు కోపించలేదయ్యా
పుణ్యక్షేత్రమందు పుట్టెనితడు।

2. దార్శనికుడవయ్య ధరణికే వెలుగయ్య
నిన్నుబోలు రత్నమిలను లేదు
ఒక్కమాట మీద చక్కగా నిలిచావు
నాయకత్వ మెఱిగినట్టివాడ!

3. గగనవీధి నుండి గమనించు మమ్ముల
మరువకయ్య మమ్ము మరువకయ్య
నీదు సేవలెపుడు నెమరు వేయుట తప్పు
వేరు ధ్యాసలేని తీరు మాది

4. విశ్వవ్యాప్తమైనవిఖ్యాతినార్జించి
స్వంత చింత లేని వ్యక్తివయ్య
నిన్ను పోల్చుకొనగనేడేడు జన్మలు
చాలవయ్య స్వామి చాలవయ్య

5. దేశప్రజలు నీకు దేదీప్యమానంగ
అంజలించి రయ్య అదియె ఘనము
భార్యబిడ్డలేరు భరతమాతకు బిడ్డ
కందరంద రైరి అతని కిపుడు

6. విశ్వవిఖ్యాతిగాంచిన విశ్వనరుడ
ముగ్గురమ్మలు వారికి మోకరిల్లి
వారి పూజలు చేయుచు దారి నడచు
తస్మదీయులు లేనట్టి ధన్యుడౌర!

7. జన్మధన్యమైన జన్మంబు నీదయా
భరతభూమి కన్న భవ్య చరిత (భాగ్యశాలి)
దేశక్షేమమరసి తిరిగినా వింతగా
అలసి సొలసినట్టి ఆప్తుడౌర!

8. క్షిపణులెన్నొ పంపె నిపుణుడవై నీవు తలమునకు
శాస్త్ర విషయములను సంగ్రహించ
దేశరక్షణమున దీటుగా నిలిచావు
వందనములు స్వామి అందుకొనుము।

## పెద్దాపురం మున్సిపాలిటీకి పంచరత్నములు

1. నూరు వత్సరములు నిండినా యీమెకు
దశదిశలలోన దర్పమొలుక
పంచభక్ష్యములను పదిమందికీ పెట్టి
ఖ్యాతి నంది నట్టి ఘనత కలిగి



2. గాంధిగారి రాక కనువిందు చేయగా
మున్సిపాలిటీకి మురిపమాయె
పెద్దలంత కలసి పెద్దాపురమ్మును
వృద్ధి చేసినట్టి వృద్ధి నిజము

3. కవులు పుట్టి రిచట కవయిత్రులూ పుట్టె
ఏన్గు లక్ష్మణయ్య ఇచట పుట్టె
పరమ భక్తులైన పరమయ్య మసలగా
వేదులంతవారు విజ్ఞులైరి

4. ముద్దుగొల్పునట్టి ముప్పన వంశము
పాలనమున దీని బాగు కోరె!
సూరిబాబురాజు కోరిక తీరంగ
బాగు కోరె దీని బాగు కోరె!

5. గొడవ గోలలేని గొప్ప పట్టణమండి
మంచి మనుషులున్న మంచి పురము
పట్టు వస్త్రములకు పట్టున్న దీభూమి
దశదిశలలోన దర్పమొలికె!

## అల్లూరి సీతారామరాజు

1. లాలు బాలు పాలు లాలించి చెప్పంగ
దీక్షపట్టినాడు మోక్షమరసి
సీతరామరాజు చేపట్టె దీక్షను
మన్యవీరులంత ధన్యులాయె!

2. ఒక్కమాట మీద ఓపికతో నిల్చె
భరతదేశ ప్రజలు పట్టుదలగ
మన్యవీరుడిచట మనసార దీక్షను
మొదలుపెట్టినాడు కదము త్రొక్కి

3. దేశనాయకులకు దీటుగా నిలచిన
సీతారామరాజు ఖ్యాతి ఘనము
స్వార్థమెరుగనట్టి స్వాతంత్ర్య యోధుని
మరువరాదు మనము మరువరాదు

4. మర్మమెఱుగనట్టి మహారాజు నీవయా
గుండె చూపినట్టి బండ మనిషి
ఇంగిలీషువారలెంతగా జడిసిరో
నాయకత్వ లక్షణములు జూచి

5. సిద్ధహస్తుడయ్య చెప్పింది చేయంగ
తిరుగుబాటు తత్త్వమెతిగినాడు
దేశమాత కొఱకు దీక్షను పట్టంగ
రామరాజు మనకు రక్షణయ్యె

6. రామరాజు తమకు రక్షణనివ్వంగ
మన్నెమంత నిలచె మాటమీద
వెన్ను చూపనట్టి వీరుడే యాతడు
త్యాగధనుడె అతడు ధన్యజీవి

7. భరత ఖండంబు చక్కని పాడియావు
అనుచు నెలుగెత్తి చాటిన యతడు ఘనుడు
దొరల నిట నుండి తరిమిన దొరయునితడు
శక్తియుక్తులు కలిగిన శాంతమూర్తి

8. బోసు మాట వినగ బోరున ఏడ్వరే
నాటి తెల్లదొరలు నవ్వలేక
సాహసమ్మె సొమ్ము సభ్యతగల యట్టి
సీతరామరాజు ఖ్యాతి ఘనము



9. మన్యవీరుడితడు మనవాడె అల్లూరి
కొండ జనులపైన కూర్మి జూపి
భరతమాత యనిన పరవశించునితడు
దేశ శృంఖలములు త్రెంప బూని!

## సినీ గాయకులు కె.జె. ఏసుదాసుగార్కి పంచరత్నములు

1. శ్రావ్యమైన గొంతు సరిగమ పాడంగ
శ్రోతలందరికిని ఊతమౌగ
రాగ తాళ ధ్వనులు రంజిల్ల పాడగా
ఏసుదాసు గాత్రమెంత ఘనము

2. ఆంధ్రులంత నిన్ను ఆదరించిన తీరు
ముచ్చటించినపుడు మురిసిపోతి
వేయిమందిలోన హాయి గొల్పెడి పాట
ఏసుదాసు మీకు దాసుడితడు

3. నిండు మనిషి మీరు నీటైన మనిషిగా
రూపమందగించె చూపు కూడ
రాగమందుకొనగ రసరాజు మీరాయె
మేరు వంటి మనిషి ధీరుడాయె!

4. శరణు శరణు శరణు శరణమో అయ్యప్ప
యనుచు పాట పాడ హాయి గొలుపు
ధరణి నేలు రాజు తలను వంచును మీకు
ఏసుదాసు ఖ్యాతికెవరు సాటి

5. గొప్ప చెప్పుకోని గుట్టైన మనిషికి
సాధనమ్ము తప్ప బాధలేదు
జన్మమనిన మీదు జన్మమే జన్మమ్ము
సహజ సిద్ధమైన సాధకునికి

## సినీ దిగ్గజం - ఎస్వీ రంగారావు - తెలుగు సినీనటులు

1. రాజరాజు పాత్ర రాణించు విధమున
నటన చేసి చూప నటులు వీరె।
ఎస్వి రంగరావు ఏ పాత్ర చేసినా
తిరుగులేని దతని తీరు వేరె!

2. తండ్రి పాత్ర కితడు తనదైన శైలిలో
అభినయమ్ము చేయ అందగించు
అన్నగారిపాత్ర కందగించునితడు
తాతగారిపాత్ర దర్పమొసగు।

3. అభినయమ్ములోన అందెవేసిన చేయి
దర్శకునికి నచ్చు దర్పమౌర।
చిత్రసీమకితడు సిరిగలవాడుగా
పేరుగాంచినట్టి పెద్ద నటుడు।

4. పాత్ర బరువు తెలసి పట్టుగా నటియించు
హాస్యనటనకితడు అందగించు
కరుణ రసము జూడ చెరువులా దుఃఖమ్ము
పొంగి పొరలి వచ్చి కృంగ జేయు

5. ధనిక బీద పాత్ర తగినట్లు చేయగా
ఖ్యాతిగాంచినట్టి ఘనులు వీరు
అభినయమ్ము గొప్ప అందమూ గొప్పదై
నిండు దనము నొసగు నితని పాత్ర।

6. నటన నవలీలగాజేయు నటుడె ఇతడు
మాట తడబడకుండగ మాటలాడు
శబ్ద సౌందర్యమితనికి సహజ గుణము
కనుబొమలకంద మీతని కనుల తీరు।



7. ఉగ్గు పాలతోడ ఉగ్గు పట్టిన తల్లి
నటన రంగరించి నటన నేర్పె
దర్శకునికి తగ్గ దర్పమ్ము కలిగిన
ఎస్వి రంగరావు ఎంత ఘనులొ?

8. చిత్రసీమకితడు మిత్రుడై వెలుగొందె
మంచినటుడు కనుక ఎంచతరమె?
పెద్దదిక్కు పోయి మొద్దైన సీమకు
నటుడు లేని కొఱత నరకమండి

9. తాండ్రపాపరాయు దర్పమ్ము చూపించ
నీకె సాధ్యమగును నిజము నిజము
కదనరంగమందు గండర గండడై
నటన చూపినట్టి నటుడవీవె।

## మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ నందమూరి తారక రామారావు

1. నందమూరి చేయు నవరస నటనలు
తెలుగువారికెంత తీయదనము
నిండు చందమామ నీటైన నటుడండి
తెలుగువారికితడు వెలుగుచూపె।

2. రాముడనగనితడె రమ్యమై వెలుగొందు
కృష్ణుడనగనితడె కీర్తినందె
బండపాత్రకైన మొండిపాత్రకునైన
కండ చూపగలడు కత్తిపట్టి।

3. కరుణ రసము నందు వరుణుడే దిగివచ్చు
బరువు పాత్ర వేయ గురువు కాదె।
గాత్ర సుద్ది చూడ గంధర్వుడే కదా।
ఇన్ని గుణములితని కింపు కాదె?

4. మధురమైన వాక్కు మనసార పలుకంగ
ఎవరు సాటిరారు ఇతనికెపుడు
గర్వపడెడి జన్మ కారణ జన్ముడు
జన్మ ధన్యమైన జన్మమండి।

5. తల్లిదండ్రులెంత ధన్యులో చూడండి
పూజ్య భావమందు పురుషుడితడు
ఆంధ్రజాతికితడు ఆరాధ్యదైవమై
పూజలందు కొనెడి పుణ్యమూర్తి।

6. ముఖ్యమంత్రి పదవి ముద్దుగా చేపట్టి
కీర్తినందినట్టి మూర్తి కాదె
శాసనములు చేయ శాశ్వత కీర్తిని
గాంచి నాడు కనుక గణుతికెక్కె।

## నేను రచించిన ఇతర గ్రంథముల పేర్లు

1. ధర్మశతకము
2. ధర్మరాజీయము
3. ధర్మప్రబోధము
4. ధర్మాభిషేకము

**కావ్యశ్రీ (గుండాబత్తుల నారాయణరావు) పద్యకృతులు**
**ఒక అనుశీలనము - పరిశోధనా గ్రంథము.**